క్లుప్తంగా

దూరవిద్యలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.విశ్వేశ్వరరావు తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు, సంస్కృత అకాడమీ నుంచి బీఈడ్ విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దిన మూడో సెమిస్టర్ జీవశాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం–2 పుస్తకాన్ని ఏయూ దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య చంద్రశేఖర్, ఆచార్య సత్యనారాయణ, ఎమిరిటస్ ప్రొఫెసర్ ఆచార్య పరమేశ్వర రావు, పుస్తక రచయితల్లో ఒకరైన డాక్టర్ జయరాం కనకల తదితరులు పాల్గొన్నారు. పుసక్త సహ రచయిత జయరాం మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు ఈ పుస్తకం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ నరసింహారావు తదితరులు

ఏయూక్యాంపస్ : ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కార్యాలయ సిబ్బంది కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రం చేశారు. వ్యర్థాలు, ఎండుటాకులు, కొమ్మలు ఏరివేసి శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సిబ్బందిని అభినందించారు. వర్సిటీని స్వచ్ఛ క్యాంపస్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ఉద్యోగులు చూపిన చొరవ పట్ల ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

నెహ్రూ నగర్‌లో చెత్త తొలగింపు



నెహ్రూనగర్‌లో జేసీబీతో చెత్త తొలగిస్తున్న దృశ్యం

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు నెహ్రూనగర్‌లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను బుధవారం తొలగించారు. పారిశుధ్య కార్మికులు కొద్ది రోజులుగా సమ్మె చేస్తుండటంతో, రోడ్లపై చెత్త పేరుకుపోయి, స్థానికులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పన్నెండో వార్డు నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి సమక్షంలో ప్రైవేట్ కార్మికులు బుధవారం చెత్త తొలగించారు. ఆ సమయంలో సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు వచ్చి అడ్డుకోగా.. కార్పొరేటర్ వారికి నచ్చజెప్పారు. చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పనులు అడ్డుకోవద్దని కోరారు. వారు సంయమనం పాటించడంతో ప్రైవేట్ కార్మికులు కొన్నిచోట్ల చెత్తను జేసీబీతో తొలగించి, బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు.

ఆకర్షిస్తున్న కళాకృతులు



లా కాలేజీ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సింహం కళాకృతులు

కొమ్మాది: నగర సుందరీకరణలో భాగంగా తీర ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న కళాకృతులు ప్రయాణికులు, పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఎండాడ జాతీయ రహదారి కూడలి, కొమ్మాది ప్రధాన జంక్షన్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన కళాకృతులతో పాటు ఎండాడ లా కాలేజీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సింహాల కళాకృతులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ప్రజారోగ్యానికి 'సురక్ష'

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- 307 మందికి వైద్యసేవలు



శిబిరంలో అందుబాటులో ఉంచిన మందులు



పదమూడో వార్డు యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేయించుకుంటున్న స్థానికులు



వృద్ధురాలికి మందులు, జగనన్న సురక్ష కార్డు అందిస్తున్న వైద్యురాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంపై దృష్టి సారించారు. అందులో భాగంగా ప్రజలకు అందుబాటులో పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గతేడాది అక్టోబరులో మొదటి విడత శిబిరాలు నిర్వహించి, తూర్పు నియోజకవర్గంలో వేల మందికి వైద్య సేవలు అందించారు. ఈ నెల 2 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నియోజకవర్గంలో జీవీఎంసీ పదమూడో వార్డు శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మలేరియా, టీబీ మందులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నిత్యం పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు ప్రదర్శించారు.

307 మందికి వైద్య సేవలు

శిబిరంలో రోగుల కోసం ఓపీ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్, కన్సల్టెన్సీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణాపురంతో పాటు రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, దారపాలెం, కామాక్షినగర్ కాలనీల నుంచి 307 మంది ఇక్కడ సేవలు పొందారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జీరియాట్రిక్స్, ఆప్తమాలజీ, డెంటల్ తదితర విభాగాల వైద్యులు రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. జనరల్ మెడిసిన్‌లో 175 మందికి, 31 మందికి దంత పరీక్షలు, 25 మందికి కంటి పరీక్షలు, 76 మందికి ఆర్థోపెడిక్, జీరియాట్రిక్స్ పరీక్షలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, భాస్కర్, కె.సుబ్బారావు తదితరులతో కలసి యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలితకుమారి ఇక్కడ వైద్యసేవలు పొందిన వృద్ధులు, మహిళలకు మందులు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ లలిత మాట్లాడుతూ శిబిరంలో ఐదుగురు స్పెషలిస్టులతో 307 మంది రోగులకు సేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. శిబిరంలో వైద్యులతో పాటు మలేరియా, టీబీ, పారిశుధ్యం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయాల సిబ్బంది సేవలు అందించారు.

మాలాంటి వారికి ఎంతో మేలు



నాకు 78 సంవత్సరాలు. ఇంతవరకు ఎందరో ముఖ్యమంత్రుల పాలన చూశాను. ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించి ఇంటి వద్దకే వైద్యులను పంపించిన ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నాను. ఈ వయసులో నేను దూరప్రాంతంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లలేను. కానీ ఇంటికి దగ్గరలో వైద్యం అందించడంతో నేను సులువుగా రాగలిగాను. మాలాంటి వారికి ఇలాంటి శిబిరాలు ఎంతో మేలు చేస్తాయి. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎన్‌సీహెచ్ రాజన్ నాయుడు, పైనాపిల్ కాలనీ

ఇంటి దగ్గరలోనే వైద్యసేవలు



ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన శిబిరం వల్ల మాలాంటి వృద్ధులకు ఎంతో మేలు కలుగుతుంది. 80 సంవత్సరాలు దాటిన నేను ఎక్కువ దూరం వెళ్లలేను. ఇంటికి దగ్గరగా ఉండటంతో ఈ శిబిరంలో డాక్టర్‌కు చూపించుకున్నాను. నాకు ఇక్కడ కంటి పరీక్షలు, సుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– వీఆర్ ప్రసాద్, పైనాపిల్ కాలనీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శ్రీహరినగర్‌లో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదకొండో వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన 20, 30 నంబర్ల సచివాలయాల పరిధిలో రవీంద్రనగర్, గాంధీనగర్, శ్రీహరినగర్, కైలాసనగర్‌లో ఇంటింటికీ వెళ్లారు. ప్రజలకు సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు అందించారు. పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అందుకే ప్రజలు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి

- ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య సమత
- తొలి ఉపాధ్యాయినికి ఘన నివాళులు



ఏయూలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య షారోన్‌రాజు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జి వీసీ సమత తదితరులు



ఎంఈవో బాలామణిని సన్మానిస్తున్న రవిసిద్ధార్థ్

ఏయూ క్యాంపస్: దేశంలో మహిళా విద్యకు ఆద్యురాలిగా సావిత్రిబాయి పూలే నిలుస్తారని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. దేశంలో నేడు మహిళల ప్రగతికి నాడు సావిత్రిబాయి చేసిన ముందడుగే కారణమన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఏయూలోని డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను, సాంఘిక కట్టుబాట్లను ఎదుర్కొని సావిత్రిబాయి మహిళా విద్యను ప్రోత్సహించారన్నారు. తొలి ఉపాధ్యాయురాలిగా మారి భవిష్యత్ తరాలకు అక్షరాలను నేర్పించే గురుతర బాధ్యతను స్వీకరించి, సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. ఆ మహనీయురాలిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్య కె.సీతామాణిక్యం, డాక్టర్ పి.ఉష, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, వర్సిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏయూ విద్యా విభాగంలో..

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో సావిత్రిభాయి పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక కట్టుబాట్ల నుంచి మహిళలను విముక్తులను చేస్తూ, వారిని అక్షరాస్యులను చేసిన సావిత్రిభాయి పూలే నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సత్కారం

బీచ్‌రోడ్డు: చిన్నవాల్తేరులోని జీవీఎంసీ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతమ్మధార ఎంఈవో బాలామణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వనిత, సిబ్బంది పాల్గొన్నారు.

మానవతామూర్తి.. సేవా స్ఫూర్తి

- పింఛన్ల పంపిణీ నేపథ్యంలో సీఎంను కొనియాడిన లబ్ధిదారులు
- 20వ వార్డు పరిధిలో పండగలా కొత్తగా మంజూరైన పెన్షన్ల అందజేత



పింఛన్లు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు

ఏయూక్యాంపస్ : మానవత్వం నిండిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని వైఎస్సాసీపీ తూర్పు ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక 20వ వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఎటువంటి లంచాలు ఇవ్వనవసరం లేకుండా లబ్ధిదారుల ఇంటికే నేడు పింఛను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సేవా నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వచ్చి దరఖాస్తు పెట్టించారు..



మా అబ్బాయికి సచివాలయం ఆధ్వర్యంలో దివ్యాంగుల పెన్షన్‌కి దరఖాస్తు చేయించారు. గతంలో సదరం సర్టిఫికెట్ రావడానికి సైతం సచివాలయ సిబ్బంది సహకరించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని పనులు వారే చేసి సజావుగా పింఛన్ వచ్చేందుకు తోడ్పాటునందించారు. జగనన్న సేవలు మరిచిపోలేం.

– లంకపల్లి వేణు తేజ తల్లి, పెదవాల్తేరు

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



నాకు ఒక కుమార్తె. నేను ఆమె వద్దే ఉంటున్నాను. వారితో కలిసి ఉండటం వల్ల గతంలో నాకు పెన్షన్ ఆగిపోయింది. సచివాలయ సిబ్బంది ఎంతో శ్రద్ధ తీసుకుని నాకు వేరే రేషన్ కార్డు ఇప్పించి, పెన్షన్ పునరుద్ధరణకు దరఖాస్తు చేయించారు. ఇప్పుడు పెన్షన్ వస్తుండడంతో వేరే ఆధారం లేని నేను ఆ పెన్షన్‌తోనే బతుకుతున్నాను. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– చెక్క కుసుమకుమారి, కాగితాలవారివీధి, పెదవాల్తేరు

ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు



హాజరైన ప్రజలు

ఏయూక్యాంపస్: ప్రజల కోసం నిరంతరం ఆలోచన చేస్తూ, పనిచేసే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 20వ వార్డు శ్రామికనగర్‌లో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. ప్రజలు జవాబుదారీతనం గల పాలనను చూస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు గన్న పారదర్శక పాలన, సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ సాధ్యమవుతోందన్నారు. నాడు–నేడు పథకంతో పాఠశాలల స్వరూపాన్ని సమగ్రంగా మార్చివేశారన్నారు. వీటన్నింటినీ చూస్తున్న ప్రజలు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను కాపీ కొట్టి, పేర్లు మార్చి చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమను గెలిపిస్తే ప్రజలకు అందిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. 14 సంవత్సరాల కాలంలో అభివృద్ధి చేయని చంద్రబాబు కొత్తగా ఏం చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేటర్ మువ్వల లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నారుల నుంచి యువత వరకు విద్య బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే స్వీకరించిందన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎం.వి.వి. సత్యనారాయణను రానున్న ఎన్నికల్లో గెలిపించి, ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు రాము, పద్మ, పద్మజ, ప్రసాదుల హేమలత, ఉరుకూటి మురళి, కాగితాల రవికిరణ్ రెడ్డి, చంద్రాన సాయి, బొట్ట శ్రీకాంత్, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ హిందూ ధర్మాన్ని ఆచరించాలి



ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

తగరపువలస: శ్రీరాముని మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రవచకులు శ్రీరామకృష్ణ ఆనంద్ అన్నారు. చిట్టివలస రామాలయం నుంచి ఆంధ్రా బ్యాంకు మీదుగా శ్రీరాముని జీవిత చరిత్ర తెలుపుతూ బుధవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రవచకులు శ్రీరామకృష్ణ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి మానవుడు హిందూ ధర్మాన్ని ఆచరించాలని, హిందువులు అందరూ ఐక్యంగా ఉండి భక్తి భావాన్ని అలవరచుకోవాలని సూచించారు.

ముత్యాల అలంకరణలో శ్రీనివాసుడు



ముత్యాల అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

ఎంవీపీకాలనీ : సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా ముత్యాల కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోష్ఠిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 19వ పాశురాన్ని స్వామివారికి విన్నపం చేశారు. బుధవారం ఉదయం, సాయంత్రం స్వామివారికి విశేష దీప హారతి ఇచ్చారు. పూజల అనంతరం సాయంత్రం 365 ఒత్తులతో హారతి వెలిగించి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుని పెద్ద ఎత్తున పూజలు చేశారు. భక్తులకు మూడు రకాల ప్రసాదాన్ని అందజేశారు.

ఏయూకు విచ్చేసిన ఏఐయూ పరిశీలకుడు



మనీష్ జంగ్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ సమత

ఏయూక్యాంపస్: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ పరిశీలకుడు డాక్టర్ మనీష్ జంగ్ర బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్–యువభేరిని డాక్టర్ మనీష్ పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో ఫెస్టివల్ కల్చరల్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్, ఆచార్య ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమార్ తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

చెత్త తరలింపు అడ్డగింత

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో చెత్త తరలించేందుకు బుధవారం ఉదయం జీవీఎంసీ వాహనాలు రాగా గత కొన్ని రోజులుగా నిరసన చేస్తున్న పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో వాహనాలను అడ్డగించడంతో పాటు టైర్ల గాలి తీసేశారు. వాహనాల ద్వారా చెత్త తరలించేందుకు వీల్లేదంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని పక్కకి తొలగాలని సూచించినా నిరసన కారులు వినలేదు. దీంతో ఎంవీపీ సీఐ సంజీవరావు నేతృత్వంలోని పోలీసుల బృందం పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించింది. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

చండీహోమం ప్రారంభం



చండీ హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న భవానీలు

అల్లిపురం : మెయిన్‌రోడ్డులో గల దుర్గా భవానీ ఆలయంలో బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చండీ హోమం ప్రారంభమయింది. గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ చేపట్టిన అనంతరం భవానీలు విజయవాడ పయనమయ్యారు. చండీహోమం ఐదు రోజులు నిత్య అగ్నిహోత్రం ప్రజ్వరిల్లుతుందని భవానీలు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు భవానీ మాలధారులు అమ్మవారికి కొబ్బరికాయకొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తారని తెలిపారు. తొలుత వినాయక దేవాలయం వద్ద దర్శనం చేసుకుని, నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని, వేంకటేశ్వరమెట్ట దరి దుర్గమ్మను, బల్లిగిరి వేంకటేశ్వరస్వామిని, రాసపోలమాంబ అమ్మవారిని, రైల్వేస్టేషన్ దరి దుర్గమ్మను దర్శించుకుని మెయిన్‌రోడ్డులో గల దుర్గా భవానీ ఆలయానికి చేరుకుంటారన్నారు. అక్కడ మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.